## సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో

# ఎన్నికల సామగ్రి

- స్ట్రాంగ్ రూం, ఏర్పాట్లను పరిశీలించిన సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి శరత్
- భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ రూపేశ్

చౌటకూర్/ అందోలు, అక్టోబర్ 26 : చౌటకూర్ మండలంలోని సుల్తాన్‌పూర్ వద్ద ఉన్న జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అందోలు అసెంబ్లీ నియోజకవర్గం పోలింగ్ ఈవీఎంలను భద్రపర్చడానికి వినియోగిస్తున్న స్ట్రాంగ్ రూంలను గురువారం సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేశ్‌కుమార్ పరిశీలించారు. కళాశాలలోని ఫార్మసీ బ్లాక్‌లో ఐదు గదులను కేటాయించారు. రెండు గదులను ఈవీఎంలను భద్రపర్చడానికి వినియోగిస్తుండగా, సాబగ్రి, కమిషనింగ్‌కు రెండు గదులు, మరో గదిని కంప్యూటర్ పర్యవేక్షణకు వినియోగిస్తున్నారు. నవంబరు 30వ తేదీన పోలింగ్ జరుగనున్న దృష్ట్యా ముందస్తుగానే అందోలు నియోజకవర్గంలోని 313 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఈవీఎంలను జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలోని ఫార్మసీ బ్లాక్‌ను కేటాయించారు. ఫార్మసీ బ్లాక్ వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. జేఎన్టీయూ కళాశాల వద్ద నుంచే నియోజకవర్గంలోని 313 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించనున్నారు. పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించేందుకు అవసరమైన సిబ్బంది, వాహనాలు, అందుకు అవసరమైన వేదిక, వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. 2018 అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో కూడా ఇక్కడి నుంచే ఈవీఎంలను తరలించారు. తాజాగా మరోసారి జేఎన్టీయూ వేదికగా ఈవీఎంలను తరలించేందుకు ఎన్నికల అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.నర్సింహ, కళాశాల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈవీఎంల తరలింపు రోజున వచ్చే పోలింగ్ సిబ్బంది అసౌకర్యానికి గురవకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం అందోలులోని ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ శరత్ మాట్లాడారు. ఓటరు నిష్పక్షపాతంగా, నిర్భయంగా తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేందుకు మంచి వాతావరణాన్ని కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నిబంధనలను రాజకీయ పార్టీల అభ్యర్థులు పాటించాలని సూచించారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రచారాన్ని నిర్వహించుకోవాలని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులకు అనుమతులను ఎన్నికల ప్రవర్తనా నియామవాళి ప్రకారం ఇస్తామన్నారు. విజిలెన్స్ సిటిజన్ యాప్‌లో సమాచారం ఇస్తే అభ్యర్థులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాండు పాల్గొన్నారు.

**స్ట్రాంగ్ రూంలకు సీల్ చేసిన ఎన్నికల అధికారి**

సంగారెడ్డి, అక్టోబరు 26 : ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ను రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి రవీందర్‌రెడ్డి సీల్ వేశారు. పట్టణంలోని అంబేద్కర్ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన సంగారెడ్డి నియోజకవర్గ–39 ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను సీల్ వేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రమేశ్‌కుమార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఫర్వీన్ షేక్, విజయలక్ష్మి, నాయకులు ఉన్నారు.



సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేశ్‌కుమార్




సంగారెడ్డి : స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీందర్‌రెడ్డి

## కౌంటింగ్ సెంటర్లలో ఏర్పాట్లు

- పరిశీలించిన మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా



వైపీఆర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి

మెదక్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : హవేళీఘనపూర్ శివారులోని వైపీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మెదక్ 34, నర్సాపూర్ 37 నియోజకవర్గాల కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా పరిశీలించారు. కౌంటింగ్ రోజు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, నవంబర్ 15లోపు సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంటర్నెట్, మీడియా పాయింట్, బారికేడ్లు, విద్యుత్ సరఫరా, తాగునీరు వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ అనంతరం ఈవీఎంలు, వీవీప్యాట్లను భద్రపరచడానికి పిల్లికోటాల్‌లోని పాత కలెక్టర్‌రేట్‌ను పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాస్, తహసీల్దార్లు శ్రీనివాస్, నారాయణ, పీఆర్ ఈఈ నర్సింహులు, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## 30, 31న ఎన్నికల సిబ్బందికి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా

మెదక్ అర్బన్, అక్టోబర్ 26 : ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు చెందిన పోలింగ్ సిబ్బందిని కేటాయించామని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 30,31 తేదీల్లో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి పీవో955, ఏపీవో 955, వోపీవోకు చెందిన 1842 మంది సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో కాధాకృష్ణ, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ కోర్టుకు భవనం పరిశీలన

అల్లాదుర్గం, అక్టోబర్ 26 : మండల కేంద్రంలో సివిల్ కోర్టు ఏర్పాటు కోసం గురువారం స్థానికంగా ఉన్న అతిథి భవనంతో పాటు ఎస్సీ వసతి గృహాన్ని జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లాదుర్గం మండలకేంద్రంలో మంజూరైన సివిల్ కోర్టు భవన ఏర్పాటుకు స్థానిక అతిథిగృహం వద్ద 3 ఎకరాల స్థలాన్ని తహసీల్దార్ కేటాయించారని తెలిపారు. భవన నిర్మాణానికి సమయం పడుతుండడంతో తాత్కాలిక భవనంలో కోర్టు ఏర్పాటు నిమిత్తం భవనాలను పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్, సీఐ జార్జి, ఎస్సై ప్రవీణరెడ్డి, అడ్వకేట్లు కృష్ణారెడ్డి, నారాయణ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కంచరి బ్రహ్మం తదితరులు ఉన్నారు.



అల్లాదుర్గంలో తాత్కాలిక భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద

## సీఎం కేసీఆర్‌కు దసరా శుభాకాంక్షలు



సీఎం కేసీఆర్‌తో షెపర్ట్ ఇండియా అధ్యక్షుడు బూరుగడ్డ నగేశ్

రామచంద్రాపురం,అక్టోబర్ 26 : ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ని షెపర్డ్ ఇండియా అధ్యక్షుడు, సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు బూరుగడ్డ నగేశ్ గురువారం ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు కర్ణాటక మాజీ మంత్రి హెచ్‌ఎం రేవన్న, కురుమ సంఘం నాయకుడు క్యామ మల్లేశం తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంట్ కష్టాలు

- మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి
- పాపన్నపేట మండలంలో ఎన్నికల ప్రచారం
- బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి



రాజ్యతండాలో ప్రచారం చేసున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట, అక్టోబర్ 26 : కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంట్ కష్టాలు మొదలవుతాయని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రం పాపన్నపేటలో గురువారం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తిరుపతిరెడ్డితో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం రాజ్యాతండా, డాక్యతండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కేవలం మూడు గంటల కరెంటు వస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే అసైన్డ్ భూముల నిబంధనలను సులభతరం చేస్తామని తెలిపారు. తండాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న లక్ష్యంతో గ్రామపంచాయతీలుగా చేశామన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతుబంధు ఆర్థిక సాయాన్ని నిలిపివేయాలని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఎన్ని కుట్రలు, కుంతంత్రాలు చేసినా గెలవలేరన్నారు. కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య కుర్చీల కొట్లాట ఉంటుందన్నారు. 13 ఏండ్లుగా మైనంపల్లి మెదక్ నియోజకవర్గాన్ని మర్చిపోయాడని విమర్శించారు. ఆయన గిన్నెలు, గ్లాసులు ఇచ్చిండన్నారు. నీళ్లు లేనప్పుడు బోర్లు ఎందుకు వేయలేదని?, ఇప్పుడేందుకు వే స్తున్నాడని ప్రశ్నించారు. బీఆర్ఎస్ తండాలను గ్రామపంచాయతీలుగా చేసి పరిపాలన సులభతరం చేసిందని వివరించారు. గతంలో ఘనపూర్ సాగునీరు రావాలంటే రాస్తారోకోలు, ధర్నాలు చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు సిం గూరు ప్రాజెక్ట్ నుంచి నేరుగా నీటిని వదులుతున్నట్లు తెలిపారు.

మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి డాక్య, రాజ్యతండాల్లో గిరిజన మహిళల సాంప్రదాయ దుస్తులతో ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుమ్మరి జగన్, ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు గడీల శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్‌లు గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, స్రవంతి శ్రీనివాస్, పాపన్నపేట మార్కెట్ కమిటీ చైర్మెన్ వెంకట్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు మల్లేశం, దత్తు తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిన రామతీర్థం గ్రామస్తులు**

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో నేతలు బాబా గౌడ్, ఆంటోని, సాయిరెడ్డి ఆధ్వర్యంలో రామతీర్థం గ్రామానికి చెందిన సంఘం ప్రసాద్, చాకలి విట్టల్, ఫరీదుద్దీన్, సంగయ్య, సాయిలు తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.



గిరిజన సాంప్రదాయ దుస్తుల్లో డాక్యతండాలో ప్రచారం చేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

### సంగారెడ్డి నియోజకవర్గ

## ఎన్నికల కన్వీనర్‌గా పట్నం మాణిక్యం

- సీఎం ఆదేశాలతో నియమించిన మంత్రి హరీశ్‌రావు



సంగారెడ్డి, అక్టోబర్ 26 : బీఆర్ఎస్ సంగారెడ్డి నియోజకవర్గ ఎన్నికల కన్వీనర్‌గా డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం నియమితులయ్యారు. బుధవారం రాత్రి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి హరీశ్‌రావు కన్వీనర్‌గా మాణిక్యాన్ని నియమించినట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లి సంగారెడ్డి అభ్యర్థి చింత ప్రభాకర్ విజయానికి కృషిచేయాలని మంత్రి ఆదేశించారు. ప్రజల అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు.